సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రాస పోలమాంబకు విశేష పుష్పాలంకరణ



బంతి, చామంతి మాలల అలంకరణలో అమ్మవారు

తగరపువలస: మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం బంతి, చామంతి పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించారు. 98వ వారం ప్రత్యేక అలంకరణలో భాగంగా ఆలయకమిటీ ప్రతినిధులు ఈ విధంగా అలంకరించారు. శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన గుడ్డాల రమణ, లక్ష్మి దంపతులు ఈ అలంకరణకు సహాయ సహకారాలు అందించారు. మజ్జివలసకు చెందిన తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించారు.

తీర ప్రాంతాల పరిశీలన



భీమిలి తీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భీమునిపట్నం/కొమ్మాది: భీమిలి తీరంతో పాటు బీచ్‌రోడ్డులోని పలు ప్రాంతాలను అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఏ మేరకు జరిగాయన్న దానిపై ఆర్డీవో సంగీత్ మాథూర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రామకృష్ణ, సిబ్బంది పరిశీలించారు. ఇక్కడ బిగ్‌జాగ్ రెస్టారెంట్, మంగమారిపేట వరకు ఉన్న రిసార్ట్‌లు, సాంటమ్ బార్ అండ్ రెస్టారెంట్, విరాగో రెస్టో బార్ మొదలైన వాటిని పరిశీలించారు. తీర ప్రాంత నిర్మాణాలపై కోర్టులో కేసులు ఉండడంతో ఇవి ఏ విధంగా ఉన్నాయో చూసి, దీనికి సంబంధించిన వివరాలను సేకరించారు.

ఉదయం మంచు.. మధ్యాహ్నం వడగాడ్పులు



కుసులువాడలో కురుస్తున్న మంచు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నమోదు అవుతున్నాయి. రాత్రి చలి, ఉదయం 8 గంటల వరకు మంచు కురుస్తుంది. ఉదయం 11 గంటల తరువాత ఉక్కపోతతో వడగాడ్పులు వీస్తున్నాయి. దీంతో పలువురు ఉదయం, రాత్రి వాతావరణాన్ని ఆస్వాదిస్తుండగా.. మధ్యాహ్నం వేళ ఇళ్లకు పరిమితం అవుతున్నారు.


అంధకారంలో బీచ్ రోడ్డు



అంధకారంలో తిమ్మాపురం రోడ్డు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ఉప్పాడ, మంగమారిపేట, తిమ్మాపురం, రుషికొండ మార్గంలో అంధకారం అలముకుంది. ఈ ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ రాత్రి సమయాల్లో వెలగక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిల డ్రైనేజీలతో అవస్థలు



జీరుపేటలో శిథిలమైన డ్రైనేజీని శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు జీరుపేట నుంచి చిల్లపేట వరకు శిథిలమైన డ్రైనేజీలను ఆధునీకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తరచూ ఇక్కడి డ్రైనేజీలు పూడుకుపోతుండటంతో వాటిని ఆనుకుని నివాసం ఉంటున్నవారు వ్యాధులకు గురవుతున్నారన్నారు. జీవీఎంసీలో విలీనం అయినా చిల్లపేట, జీరుపేట గ్రామాలలో అభివృద్ధి జరగలేదనడానికి ఈ డ్రైనేజీలే సాక్ష్యం అన్నారు. ఇప్పటికైనా వీటిని ఆధునీకరించి మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జంక్షన్.. టెన్షన్

- భీమిలిలో ప్రమాదకరంగా కూడళ్లు
- తరచూ ప్రమాదాలు
- కానరాని హెచ్చరికలు, స్పీడ్ బ్రేకర్లు
- హడలిపోతున్న వాహన చోదకులు



బీచ్‌రోడ్డులో మూడు రోడ్లు కలిసే జంక్షన్

భీమునిపట్నం: భీమిలిలోని పలు ప్రాంతాల్లో జంక్షన్లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. హెచ్చరిక బోర్డులు గానీ, స్పీడ్ బ్రేకర్లు గానీ లేకపోవడంతో వేగంగా వచ్చిన వాహనచోదకులు ప్రమాదాలపాలవుతున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటోంది.

కానరాని చర్యలు : ప్రమాదకరంగా ఉన్న ఈ జంక్షన్ల వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జంక్షన్‌కు కాస్త ముందుగా ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు లేవు. దీంతో అన్ని వైపుల నుంచి దూసుకువస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆ జంక్షన్ల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో చాలామంది వాహన చోదకులకు ఇక్కడ జంక్షన్‌లు ఉన్నట్టు కూడా తెలియడం లేదు, ఇదే పెద్ద సమస్యగా మారింది.

మూడు రోడ్ల కూడలి.. ప్రమాదాల లోగిలి

బీచ్ రోడ్డులో మూడు రోడ్లు కలిసే జంక్షన్ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా ఉంది. విశాఖ నుంచి భీమిలికి వచ్చే బీచ్‌రోడ్డు భీమిలి దగ్గరలో ఏపీ బాలికల గురుకుల పాఠశాల దాటిన తరువాత ఎడమవైపునకు నేరెళ్లవలస కాలనీ, ఎగువపేటమీదుగా ఊరిలోకి వెళ్లడానికి ఒక రోడ్డు ఉండగా, నేరుగా జిల్లా పరిషత్ వసతి గృహం, బోయివీధి మీదుగా బీచ్ లైట్ హౌస్ వద్దకు వెళ్లే రోడ్డు ఉంది. ఇలా మూడు రోడ్లు ఒకచోట కలిసే ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ ఒకేసారి మూడువైపుల నుంచి వాహనాలు అతివేగంగా దూసుకుని వస్తుంటాయి. దీంతో పలు సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతుండగా, చాలా మంది గాయపడుతున్నారు అదృష్టవశాత్తు ఇంతవరకు ప్రాణనష్టం జరగలేదు. ఇక రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోంది.

డైట్ జంక్షన్‌లో నిత్యం ప్రమాదాలే..

స్థానిక జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) జంక్షన్ వద్ద పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇక్కడ బీచ్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలు నేరుగా వెళ్తే చిన్నబజారు వస్తుంది. డైట్ వద్ద మెయిన్ రోడ్డు, తహసీల్దారు కార్యాలయం నుంచి వచ్చే వాహనాలు ఈ రోడ్డులో కలుస్తాయి. అంటే మూడువైపుల నుంచి వాహనాలు వేగంగా వస్తుంటాయి. దీంతో ఇక్కడ కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.



మూడు రోడ్ల డైట్ జంక్షన్

బీచ్‌రోడ్డులో ప్రమాదాలకు చెక్

బీచ్‌రోడ్డు కొన్ని ప్రాంతాల్లో ప్రమాదాలు తరచూ జరుగుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు దగ్గరుండి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ ప్రమాదాలకు అడ్డుకట్ట పడింది. కాని చాలా ప్రమాదకరంగా ఉన్న భీమిలిలోని జంక్షన్‌లను వదిలేశారు. ఇప్పటికైనా ఇక్కడి పరిస్థితులపై స్పందించి అధికారులు స్పీడ్ బ్రేకర్లను, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



బీచ్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

చిన్నబజార్..మహా డేంజర్

చిన్నబజార్‌లో నాలుగు రోడ్ల జంక్షన్ ఉండగా నిత్యం నాలుగు వైపుల నుంచి వాహనాలు దూసుకు వస్తుంటాయి. ఇక్కడ ప్రమాదాలు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ కొందరు చనిపోయిన సందర్భాలు ఉన్నాయి.



చిన్నబజార్ నాలుగు రోడ్ల జంక్షన్

భయంభయంగా వెళ్తున్నాం



ఈ జంక్షన్ల వద్ద ప్రయాణించాలంటే భయంగా ఉంటోంది. ఇక్కడ పరిస్థితి తెలిసిన వారు మెల్లగా, జాగ్రత్తగా వస్తున్నా.. మిగిలిన వైపుల నుంచి వాహనాలు దూసుకొస్తుండటంతో ఏ క్షణంలో ప్రమాదాలు జరుగుతాయోనని చాలా భయపడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పప్పు భరద్వాజ్, భీమిలి

చర్యలు తీసుకుంటాం



భీమిలి ప్రాంతంలో ప్రమాదకర జంక్షన్ల వద్ద అవసరమైన చర్యలను తీసుకుంటాం. అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తాం. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– సీహెచ్. చిరంజీవి, ట్రాఫిక్ ఎస్ఐ, భీమిలి

అధికారులు స్పందించాలి



భీమిలిలో జంక్షన్ల వద్ద పరిస్థితి భయంగా ఉంటుంది. ఏవైపు నుంచి ఏ వాహనం వస్తుందో అని జాగ్రత్తగా వెళ్తున్నాం. కొత్తవారైతే ఈ జంక్షన్ల వద్ద చాలా అప్రమత్తంగా ఉండాలి. అధికారులు స్పందించాలి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– తెరుపల్లి అప్పారావు, భీమిలి

మాస్టర్ ప్లాన్ రోడ్లు పరిశీలించిన కలెక్టర్



మధురవాడలో మాస్టర్ ప్లాన్ రోడ్ల మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్‌లోని వివిధ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ రోడ్లను కలెక్టర్ హరేందిర ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఇందులో వుడా హరిత నుంచి అయోధ్యనగర్ మీదుగా శివశక్తినగర్, నగరంపాలెం రోడ్లను పరిశీలించి, నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి చేపట్టవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ రోడ్లతో పాటు రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్లలో టీడీఆర్‌లు ఎంత ఇచ్చారు? ఇంకా ఎవరికివ్వాలి? అర్హులు ఎంత మంది? వారి వద్ద ఉన్న అర్హత పత్రాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. నగరంపాలెం రోడ్డులో హైవే–నగరంపాలెం రోడ్డు కలిసే చోట రోడ్డు విస్తరణకు అటంకాలు గురించి కూడా ఆరా తీశారు. ఇక్కడ దుకాణ యజమానులకు ఉన్న హక్కు పత్రాలతో తమ కార్యాలయానికి రావాలని చెప్పారు. టీడీఆర్ తీసుకుని, రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకాలు కలిగించినా ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. టీడీఆర్ మంజూరు, ఇతర అంశాలపై చేపట్టవలసిన చర్యలను ఒక ఏఈకి అప్పగించారు. పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఆయన వెంట జీవీఎంసీ సీసీపీ ప్రభాకర్, డీసీపీ హరిదాస్, ఏసీపీ తిరుపతిరావు, వీఎంఆర్‌డీఏ అధికారులు ఉన్నారు.

హిందీ హయ్యర్ పరీక్ష ఫలితాల విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి హయ్యర్ పరీక్ష ఫలితాలు సోమవారం సాయంత్రం విడుదల అయ్యాయి. భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి నుంచి శిక్షణ పొందిన 19 మంది విశారద పూర్వార్థ, విశారద ఉత్తరార్థ, ప్రవీణ పూర్వార్థ, ప్రవీణ ఉత్తరార్థ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించినట్టు మండలి అధ్యక్షుడు కె.ఎ స్.ఆర్.కృష్ణారావు తెలిపారు. ఇటీవల విడుదలైన లోయర్ పరీక్ష ఫలితాలలోను విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

గ్రామీణ వైద్యులకు క్యాన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌చంద్ర

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూడలిలోని ప్రైవేట్ హోటల్‌లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యులసంఘం ఆధ్వర్యంలో మంగళవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు వి.ఎస్.శరత్ చంద్ర, కె.ఫణిశేఖర్ గొంతు, ప్రొస్టేట్ క్యాన్సర్లకు సంబంధించి గ్రామీణ వైద్యులకు సూచనలు చేశారు. 60 ఏళ్ల పైబడిన మగవారిలో తరచూ మూత్ర విసర్జనలో మంట, తక్కువ విసర్జన, నొప్పి ఉంటే వైద్యుని సంప్రదించాలన్నారు. 40 ఏళ్ల పైబడిన మహిళలకు తరచూ రక్తస్రావం జరిగినా, వక్షోజాలలో గడ్డలు కనిపించినా వైద్యుని సంప్రదించాలన్నారు. వీటి పట్ల గ్రామీణ వైద్యులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకుడు జంగం జోషి, జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, విశ్రాంత పారా మెడికల్ అధికారి నరేంద్రకుమార్, మండల గ్రామీణ వైద్యులు సుధాకర్‌రెడ్డి, కె.ఎన్.రావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ఉపాధికి ముప్పు

- విద్యుత్ మీటర్ రీడర్ల నిరసన
- ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్



జోన్–3 ఈఈ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మధురవాడ: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్ల వల్ల తమ ఉపాధికి ముప్పు ఏర్పడుతుందని విద్యుత్ మీటర్ రీడర్లు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపకపోతే కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ పిలుపు మేరకు మధురవాడలోని విశాఖ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద జోన్–3 కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని నినదించారు. సంఘంజోన్–3 అధ్యక్షుడు పి.సురేష్, సెక్రటరీ కె.శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ సంస్థను నమ్ముకుని 10–15ఏళ్లుగా పనిచేస్తున్నామని, తమకు సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని కోరారు. అనంతరం ఈఈ శ్రీనివాసరావు లేకపోవడంతో ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎస్.అప్పలరాజు, పి.శ్యామ్ సుందర్, వి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా కుళ్లిన కోడిగుడ్లు

వాంతులు చేసుకున్న లబ్ధిదారులు



ఉడకబెట్టిన కోడిగుడ్లు ఇలా..

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు జీరుపేట అంగన్‌వాడీ కేంద్రం ద్వారా సోమవారం ఇద్దరు లబ్ధిదారులకు సరఫరా చేసిన కోడిగుడ్లు కుళ్లిపోయి కనిపించాయి. ఉడకబెట్టి చూడగా నల్లగా మారిపోయి దుర్వాసన రావడంతో లబ్ధిదారులు వాంతులు చేసుకున్నారు. మిగిలిన కోడిగుడ్లను నీటిలో వేసి చూడగా తేలి కనిపించాయి. వాటిని పగలగొట్టి చూడగా పచ్చసొన కుళ్లిపోయి ఉంది. ఈ విషయాన్ని అంగన్‌వాడీ నిర్వాహకురాలు సరస్వతి దృష్టికి తీసుకురాగా సోమవారం పంపిణీ చేసిన గుడ్లు పాత స్టాక్ అని, మళ్లీ కొత్త స్టాక్ వచ్చిందని చెప్పారు. కోడిగుడ్లు పాడైపోయిన లబ్ధిదారులు వస్తే కొత్త స్టాకులో నుంచి తీసి ఇస్తామన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణిలు, బాలింతలకు ఇచ్చే కోడిగుడ్లు, బియ్యం తదితర వస్తువుల ముందుగా తనిఖీ చేసి ఇవ్వాలని కోరారు.

శ్మశానవాటిక వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు





మజ్జివలస శ్మశానవాటిక స్థలంలో హెచ్చరిక బోర్డు పెడుతున్న వీవోఏ లక్ష్మి

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్మశానవాటిక స్థలంలో ఎట్టకేలకు రెవెన్యూ సిబ్బంది మంగళవారం హెచ్చరిక బోర్డు పెట్టారు. మహరాజుపేట–పద్మనాభం రహదారిని ఆనుకుని సర్వే నంబర్ 119/1లో సుమారు ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఈ శ్మశానవాటికను 250 కుటుంబాల వారు వినియోగించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.12 లక్షల నిధులతో ఈ శ్మశానవాటికలో వసతులు కూడా సమకూర్చింది. ఇటీవల కూటమి ప్రభుత్వానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు ఇక్కడి శ్మశానవాటికలో 400 గజాల మేర స్థలాన్ని కాజేసే ప్రయత్నం చేశారు. దీంతో 'శ్మశానవాటిక స్థలంపై కూటమి నాయకుల రుబాబు' శీర్షికతో ఫిబ్రవరి 17న సాక్షిలో ప్రచురితమైన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. వీవోఏ బోనిల లక్ష్మితో హెచ్చరిక బోర్డు పెట్టించారు.

పార్టీ పటిష్టతకు సమన్వయంతో పని చేద్దాం

- త్వరలో కమిటీల ఏర్పాటు
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను
- పద్మనాభం మండల కార్యకర్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

పద్మనాభం: వైఎస్సార్‌సీపీ పటిష్టతకు అందరం సమన్వయంతో పని చేద్దామని పార్టీ భీమునిపట్నం నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనతో పాటు కార్యకర్తలందరూ కలిసి ప్రయాణం చేసి, పార్టీని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యకర్తలు సమస్యలుంటే తనకు తెలియజేయాలన్నారు. వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటానన్నారు.

బాగా పని చేసేవారికి కమిటీల్లో చోటు

త్వరలోనే మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. బాగా పని చేసే వారిని కమిటీల్లోకి తీసుకుంటామన్నారు. కమిటీల్లో ఉన్న వారు పార్టీ అభ్యున్నతికి కష్టపడి పని చేయాలని సూచించారు. దీనిలో భాగంగా పంచాయతీల వారీగా పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులను పరిచయం చేసుకున్నారు. ముందుగా ఆయన తునివలసలోని బంగారమ్మను దర్శించుకుని పూజలు చేశారు.

'కోరాడ'ను ప్రతిపాదిస్తూ తీర్మానం

పార్టీ మండల అధ్యక్షుడిగా కోరాడ గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మణరావును రెండో సారి ప్రతిపాదిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కోరాడ లక్ష్మణరావును మజ్జి శ్రీనివాసరావు దుశ్శాలువాతో సన్మానించారు.

కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సుంకర బంగారప్పడు, సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరావు, బుగత సత్యనారాయణ, జి.వి.కె.కె.వర్మ, చందక శ్రీను, తోనంగి అప్పలనాయుడు, సీర సూరప్పడు, సుంకర నారాయణరావు, గాడు అప్పలరాజు, తాలాడ పద్మనాభం, కిలపర్తి సత్యనారాయణ, మాదిరెడ్డి భాస్కరరావు, బోని సన్యాసినాయడు, సుంకర పైడినాయుడు పాల్గొన్నారు.

వైఫల్యాలను ఎండగడతారనే..

కూటమి పాలనలో వైఫల్యాలను ఎండగడతారనే ప్రజల గొంతుక వినిపించాల్సిన విపక్షాన్ని గుర్తించడం లేదని చిన్న శ్రీను అన్నారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం లోపాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీలో నిలదీస్తారనే వారి భయమన్నారు. కూటమి ప్రభుత్వం నాలుగు లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వకుండా.. ఇచ్చామని అబద్ధమాడిందన్నారు. ఎన్నికల ముందు కొండంత హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక గోరంత కూడా నెరవేర్చలేదన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న తపనతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాఖపట్నాన్ని పరిపాలన రాజధాని చేయాలనుకుందని, కానీ కూటమి ప్రభుత్వ విశాఖను నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. లక్షలాదిగా పర్యాటకులు తరలివచ్చే బ్లూ ఫ్లాగ్ గుర్తింపు గల రుషికొండ బీచ్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. ఉపాధి కూలీలకు వేతనం ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. దివ్యాంగుల పింఛన్ల కోసం వైకల్య నిర్ధారణకు 30 కి.మీ.దూరంలో ఆస్పత్రికి పరీక్షలకు పంపించడం దుర్మార్గమన్నారు. పింఛన్లు తొలగిస్తే ఊరుకునేది లేదన్నారు.

మోటారు కార్మికులకు కనీస భద్రత కల్పించాలి

తగరపువలస: మోటారు వాహనాల చట్టాలలో కఠినతరమైన నిబంధనలు సవరించి కార్మికులకు కనీస భద్రత కల్పించాలని సీఐటీయూ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. బంగ్లామెట్ట వద్ద మినీ వాహనాల స్టాండ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహన బీమా, ఫిట్‌నెస్ ఫీజులు అధికంగా ఉన్నాయన్నారు. వాహనాలు, వాటి యజమానులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టిన షరతులు వెనక్కు తీసుకోవాలన్నారు. వాహన సిబ్బందిపై బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల వేధింపులు ఆపాలన్నారు. ఇంధన ధరలు తగ్గించి కార్మికులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కార్మికులు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్.అప్పలనాయుడు, స్టాండ్ అధ్యక్షుడు ఎస్.అప్పలసత్యం, ప్రధాన కార్యదర్శి వై.సూరిబాబు, కోశాధికారి ఆరె అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ పెన్షనర్ల ఆందోళన



పీఎఫ్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న చిట్టివలస ప్రాంత పెన్షనర్లు

తగరపువలస: కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని పీఎఫ్ పెన్షనర్లు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పీఎఫ్ కార్యాలయాల వద్ద ఆందోళనల్లో భాగంగా మద్రిపాలెంలోని పీఎఫ్ కార్యాలయం వద్ద చిట్టివలస ప్రాంత ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం ఆందోళన చేపట్టింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్, చిట్టివలస నుంచి 50 మంది పెన్షనర్లు ఆ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తారెత్తిస్తున్న నిత్యావసర సరకుల ధరలతో పోలిస్తే ప్రస్తుతం ఈపీఎఫ్ పెన్షనర్లకు ఇస్తున్న రూ.1000 ఏ మూలకు సరిపోదన్నారు. పార్లమెంట్‌లో వివిధ పక్షాల సభ్యులు ఈపీఎఫ్–95 పెన్షన్‌పై చర్చలు జరిపి కనీస పెన్షన్ రూ.9వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ఉద్యోగ విరమణ చేసిన అందరికీ రైల్వే ప్రయాణాలలో రాయితీలు, ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. విరమణ కార్మికులకు కూడా ప్రభుత్వాలు అందిస్తున్న సామాజిక పెన్షన్లు అందించాలన్నారు. కార్యక్రమంలో చిట్టివలస నుంచి దామోదర బాబాజీ, మోర అప్పలరాజు, చిల్ల అప్పారావు, పంపాన సూర్యనారాయణ, సింగిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్‌లో దర్బార్



మాట్లాడుతున్న 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, బెటాలియన్ దర్బారుకు హాజరైన అధికారులు, సిబ్బంది, కుటుంబాల సభ్యులు

పీఎం పాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో మంగళవారం దర్బార్ నిర్వహించారు. బెటాలియన్‌లో పని చేస్తున్న సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ మాట్లాడారు. సిబ్బంది సమస్యలపై ఆరా తీశారు. తమ పరిధిలో ఉన్నవాటిని త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించడంలో భాగంగా ఏసీలను మరింత విస్తృత పరుస్తామన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం, వి.నారాయణ, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి

9912220753

Office mail : sakshiadvtvsp@gmail.com